కథ

# పెత్తనం

- కోరుకొండ సూర్యకుమారి

కొన్నాళ్ళలో రిటైర్‌మెంటు. ఈ లోగా గానీ, తర్వాత గానీ రెండు పెళ్ళిళ్ళు చేయాలి. విశ్రాంతి తీసుకోవాలి. అంతకంటే చేయడానికి తనకింకేమీ ఉండదు - తుది శ్వాస వదలడం తప్ప!...

ఈ మధ్యకాలంలో రెండు మూడు సార్లలా అనుకున్నారు భానుమూర్తిగారు. కానీ ఈ రోజు భార్య చెప్పిన విషయం విన్న తర్వాత, స్వయంగా తను మరో విషయం విన్న తర్వాత మరోలా అనుకున్నారు.

లక్ష్మి బాధపడి చెప్పింది. తను బాధ పైకి కన్పించకుండావున్నాడు. భర్తకు విషయం చెప్పడంతో బాధ తగ్గింది లక్ష్మికి. గుండె బరువెక్కడం అప్పుడే మొదలయ్యింది భానుమూర్తి గారికి. అందుకే ఆయన ఆలోచనలో పడ్డారు!

ఆఫీసు నుండి ఆలస్యంగా వచ్చిన భానుమూర్తిగారు వేడి వేడి భోజనం చేసి గదిలోకి వెళ్ళి పేపరు పట్టుకున్నారు. లక్ష్మి అతని ప్రక్కన కూర్చుంది. పేపర్లో పడిపోయి భార్యను గమనించలేదు. పేజీ త్రిప్పుతున్నప్పుడు అనుకోకుండా భార్యను చూసారు. లక్ష్మి అలా వచ్చి కూర్చుందంటే చెప్పడానికి ఏదో విషయం ఉంటుందని ఆయనకు తెలుసు.

"ఏమిటి విషయం?" పేపరు ప్రక్కన పెడుతూ అడిగారాయన.

"రాఘవ ఆఫీసునుండి ఇంకా రాలేదండి. చిన్నాడు వచ్చి బయటకు వెళ్ళిపోయాడు."

"పెద్దాడికి ఆఫీసులో పనుండి ఉంటుంది. చిన్నాడు ఎక్కడికి వెళ్ళాడంట?"

"చెప్పలేదండి. విసుక్కుంటూ వెళ్ళిపోయాడు."

"ఏం నువ్వేమైనా అన్నావా?"

"ఏమీ అనలేదండి. ఆఫీసు నుండి ఆలస్యంగా వస్తేనూ - ఆఫీసు అయిదింటికే అయిపోతుంది కదరా, ఇంతాలస్యం అయ్యిందేం - అని అడిగానంతే"

"అందుకే విసుక్కుంటాడా, నువ్వింకేదైనా అని ఉంటావ్!"

"నేను అంతకంటే ఇంకేమీ అనలేదండి. ఎప్పుడూ లేనంతగా విసుక్కున్నాడు." క్షణం తర్వాత మళ్ళీ అంది. "ఏవండీ వాడేమని విసుక్కున్నాడో తెలుసా?"

భానుమూర్తిగారు ఆసక్తి చూపించలేదు. అయినా లక్ష్మి చెప్పకుండా ఉండలేకపోయింది.

"... ఈ రోజు 'పే' డే కదా. జీతం అందుకోడానికి ఎదురు చూస్తూ కూర్చున్నావా?అని అన్నాడండి. ముందు నాకేమీ అర్థం కాలేదు. అర్థమయ్యాక గుండెలో ముల్లు గుచ్చుకున్నట్టన్పించింది..."

చాలాసార్లు భార్యని 'పిచ్చిది' అని కొట్టిపారేసేవారు భానుమూర్తిగారు కానీ ఈసారి ఎందుకో అలా అనుకోలేకపోయారు. ఆసక్తిగా వినని ఆయనకి ఆ విషయం అర్థమయ్యాక గుండెలో ముల్లు గుచ్చుకున్నట్లునిపించింది.

అయితే పైకేమీ అనలేదు. చదివేసిన పేపర్నే మళ్ళీ అందుకున్నారు. అది గమనించి లక్ష్మి నెమ్మదిగా లేచి వెళ్ళిపోయింది.

భర్త అంతగా పట్టించుకోలేదని లక్ష్మి అయితే అనుకుంది గానీ - వెళ్ళిపోతున్న భార్యను పేపర్లోంచి చూసిన భానుమూర్తిగారు మాత్రం, భార్య అడుగులు భారంగా పడుతున్నాయి అంటే ఆమె అనుకుని చెప్పలేదని, బాధ మనసులో ఉంచుకోలేకే చెప్పిందని అర్థం చేసుకున్నారు.

ఉద్యోగం వచ్చిందన్న ఆనందం. కానీ అది వేరే రాష్ట్రంలో వచ్చిందని బాధ. వేళకు లేని తిండి. తమ భాష మాట్లాడేవాళ్ళు తక్కువ. ఒంటరిగా ఉన్నామన్న ఆవేదన. కళ్ళల్లో కన్నీటి పొర. స్వరాష్ట్రం వచ్చేయడానికి విపరీతమైన ప్రయత్నాలు. తండ్రిని, బావగార్ని పెట్టిన శ్రమ. పని అవ్వడం లేదని నిష్ఠూరంగా ఉత్తరాలు: పేజీల పేజీల ఉత్తరాలు. సీరియల్‌గా. సీరియస్‌గా. సెలవులన్నీ ఇక్కడకు వచ్చెయ్యడానికే ఖర్చు చేయడం. రాగానే ఆర్తి నిండిన చూపులు. కావలసినవన్నీ వండించుకోవడం. అవసరమైనవి మూట కట్టుకోవడం. కష్టాలు చెప్పుకోవడం కన్నీరు పెట్టుకోవడం. గుండెల్ని బరువెక్కించడం. కన్న ప్రేవుల్ని కదిలించడం. నిద్ర లేకుండా చేయడం. వెయ్యి కిలోమీటర్ల దూరాన్ని వేల కిలోగ్రాముల భారంగా చిత్రించడం. ఈ ఊరికి బదిలీలైనప్పుడు జాలువారిన ఆనంద బాష్పాలు....

అన్నీ కళ్ళల్లో కదలాడుతున్నాయి భానుమూర్తిగారికి. ఆలోచనలు నెమ్మదిగా కదులుతున్నాయి.

ఆ ఆలోచనల్లోనే ఉత్తమ్ వచ్చాడు. మరి కాసేపట్లో రాఘవ కూడా వచ్చాడు. కాళ్ళు కడుక్కోవడం, భోజనం చేయడం అన్నీ తెలుస్తున్నాయి భానుమూర్తి గారికి.

ఉదయం భానుమూర్తిగారు లక్ష్మితో ఓ విషయం చెప్పారు. దాన్ని సాయంత్రం పెద్దవాడు వచ్చాక చెప్పమన్నారు. నేను చెప్పేకంటే నువ్వు చెప్తేనే బాగుంటుందన్నారు. నేను చెప్తే వాడు సిగ్గుపడచ్చు అన్నారు. చిన్నకొడుకు మాటల్ని భర్తతో చెప్పి మరచిపోయిన లక్ష్మికి తెలీదు - భర్త ఆలోచిస్తున్నాడని. ఆ ఆలోచనలకు ఓ రూపం రాబోతుందని తెలిస్తే భర్త చెప్పమన్న విషయం పెద్ద కొడుకుతో ఇప్పుడు చెప్పి ఉండేది కాదు. చెప్పకపోయి ఉంటే భానుమూర్తి గారిలో కదులుతున్న ఆలోచనలకు ఒక ఆకృతి వచ్చి ఉండేది కాదు.

"ఒరేయ్, పెద్దాడా. ఎల్లుండి నువ్వు సెలవు పెట్టాలి"

"ఎందుకమ్మా?"

"నాన్నగారు చెప్పమన్నారు?"

"విషయం ఏమిటి?"

"మనం రాజమండ్రి వెళ్తున్నాం"

"రాజమండ్రా. ఎందుకు?"

"నిన్న మీ నాన్నగారి ఆఫీస్‌కి ఎవరో వచ్చారట. మనల్ని ఆహ్వానించారు"

"ఆహ్వానమా. దేనికి?"

భానుమూర్తిగార్కి ఆ మాటలన్నీ విన్పిస్తున్నాయి. విషయాన్ని సాగదీస్తూ భార్య చెప్పడంలో వినిపిస్తున్న మురిపానికి అతని పెదవులు చిన్నగా విచ్చుకున్నాయి.

"అమ్మాయిని చూడ్డానికి..."

"... ... ..."

"అలా చూస్తావేంట్రా నీకు పెళ్ళి చూపులు"

"ఇప్పుడెందుకమ్మా?"

"ఎందుకంటావేంట్రా. మన ఊరికి బదిలీ అయ్యాక చేసుకుంటానని చెప్పి ఇప్పుడెందుకంటావేమిటి?"

"అది కాదమ్మా నాకు ఇంకో సంవత్సరంలో ప్రమోషన్ వస్తుంది. అంతవరకూ ఆగుదామని..."

"అమ్మాయిని వెతికి పట్టుకోవడానికి, ముహూర్తాలు కుదరడానికి చాలా టైము పడుతుందిరా, అప్పటికి నీకు ప్రమోషన్ కూడా వచ్చేస్తుందిలే. నీతోపాటూ తమ్ముడికి కూడా చూడాలి కదా. అయినా ఎప్పుడు జరగాల్సిన ముచ్చట అప్పుడు జరగాలి కదరా."

రాఘవ తల్లివైపు అదోలా చూసాడు.

"ఎప్పుడు జరగాల్సిన ముచ్చట అప్పుడు జరగాలా, ఎప్పుడు దక్కాల్సింది అప్పుడే దక్కించుకోవాలా?"

లక్ష్మికి ఆ మాటలు అర్థం కాలేదు. కానీ గదిలో ఉండి వింటున్న భానుమూర్తిగార్కి అర్థమయ్యాయి. గుండెలో చిన్న ముల్లు కాదు, గునపమే గుచ్చుకున్నట్టన్పించింది. ఎందుకంటే ఆ మాటలు రాఘవ మామూలుగా అనలేదు.

తల్లికి అర్థం కాలేదనేమో రాఘవ ఇంకా వివరంగా మాట్లాడుతున్నాడు.

"త్వరలో రిటైరవుతున్నారుగా. ఈ లోగానే మా పెళ్ళిళ్ళు చేసేస్తే కట్నాల్లో ఖర్చులు, మిగులు తేలిపోతుందనా. ఎందుకమ్మా అంత తొందర. ఎవరో అమ్మాయిల్ని చూసుకొని మీకు అందకుండా ఎగిరి పోతామనా. నాకు అర్థమవుతోందిలే మీ ఉద్దేశం. అసలు మగపిల్లలు పుట్టగానే......"

రాఘవ మాట్లాడుతూనే ఉన్నాడు. అప్పటికి అర్థమైన లక్ష్మి హతాశురాలైపోయింది. భానుమూర్తిగారి పిడికిళ్ళు బిగుసుకున్నాయి!

* *

ఆ ఇంటి తలుపులన్నీ లోపల గడియపెట్టి ఉన్నాయి. ఆ గది నిశ్శబ్దంతో నిండిపోయి ఉంది.




గడియారం కూడా బిక్కు బిక్కుమంటూనే నడుస్తోంది. గుండె గడియారాలైతే మరీను, బరువు మొయ్యలేక మూలుగుతున్నాయి.

ఒక తండ్రి, ఒక తల్లి, కొడుకులు ఆ గదిలో కూర్చున్నా. ఎవరూ ఎవరితో మాట్లాడ్డం లేదు.

ఎన్నో ఆలోచనలు ఒక బిందువు వద్ద ఆగిపోయి, అక్కడి నుండి ఒకే ఆలోచన సరళరేఖలా వారం రోజులు సాగి, అది నిర్ణయమై, మరో నెల రోజులకు కార్యరూపం దాల్చిందని కూడా ఒక్క భానుమూర్తిగారికి తప్ప అక్కడెవ్వరికీ తెలీదు.

అందుకే అతని ముఖం గంభీరంగా ఉంది!

గొంతు కూడదీసుకుంటూ, మనసు చిక్కబెట్టుకుంటూ, ప్రేమను అణచుకుంటూ - అస్త్రాన్ని సంధించబోయే ముందు ఏకాగ్రతలోకి వెళ్ళిపోయినట్టు, వింటినారి ఒక్కసారి లాగి వదిలినట్టు.... భారంగా ఒక శ్వాస - నిశ్వాస.

అప్పుడన్నారు భానుమూర్తిగారు నిశ్శబ్దాన్ని చీలుస్తూ "ఈ టైముకి మిమ్మల్ని తప్పకుండా కలవమన్నది.... ఎందుకో ఊహించగలరా?"

అన్నదమ్ములిద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. లక్ష్మి మాత్రం అర్థంగాక అమాయకంగా చూస్తోంది, భర్త వైపు.

"మీరు నా గుండెల మీద ఆడినప్పుడు, నా చిటికెనవ్రేలు పట్టుకొని బుడి బుడి అడుగులు వేసినప్పుడు, అప్పుడప్పుడే చిన్న చిన్న మాటలు పలుకుతున్నప్పుడూ, ఏదైనా చెప్పడానికి మాటలు కూర్చుకోడానికి తికమకపడుతున్నప్పుడూ..." ఇద్దరి బాల్యాన్ని గుర్తుచేసుకుంటూ రాఘవ గొంతు విప్పాడు.

"కొడుకుల తలల మీద తలంబ్రాలు పోసే కోడళ్ల కోసం ఆశపడిన తల్లిదండ్రుల్ని అవమానపరుస్తారని ఎప్పుడూ అనుకోలేదురా. పెళ్ళిచేయడం అంటే మీ జీవితాంతం తోడుండలేని మేము, మేముండగానే మీకో తోడునందించడమే అనుకున్నాను గానీ కట్నాలందుకోవడం అనెప్పుడూ అనుకోలేదు"

క్షణం ఆగి..." స్వరం గొంతుదైతే - మాట మనసుది, ఆలోచన మెదడుది. మనసు- మెదడు కలిపి మీ అమ్మతో నువ్వన్న మాటలు నా చెవిన పడిన నాడు నేనెంత మధన పడ్డానో నీకు తెలీదురా...."

విషయం అర్థమైంది రాఘవకు.

"లే... లేదు నాన్నా. ఆ రోజు ఏదో అలా అనేసాను..." తలదించుకొని అన్నాడు రాఘవ.

"అసంకల్పిత చర్యకు- సంకల్పిత చర్యకూ తేడా తెలియని వాణ్ణి కాదురా. మహా వృక్షం కూడా చిన్న విత్తనం నుండే పుట్టుకొస్తుందిరా. నువ్వన్న ఆ మాట కాకతాళీయం కాదు. అంతర్లీనంగా ఏదో భావం మెదలకపోతే అలాంటి మాట ఎప్పుడూ రాదు..."

అంతవరకూ ఊరుకున్న వాడుకల్పించుకుంటూ... "పోన్లెండి నాన్నా. అన్నయ్యేదో తెలియక అనేసాడు" అన్నాడు ఉత్తమ్.

"ఉత్తమ్. నువ్వేమీ ఉత్తముడివి కావు. అన్నలాగే నువ్వూ అన్నకంటే ముందే అన్నావు అమ్మని. చిన్నప్పుడు బడి నుండి ఆలస్యంగా వస్తే అంతవరకూ ఎదురుచూసిన అమ్మ నీకు అన్నం పెట్టడానికే ఆతృత పడింది అంటే

ఒప్పుకుంటావా....

అంతవరకూ చూస్తూ ఊరుకున్న లక్ష్మి భర్తని వారించబోయింది.

"లక్ష్మీ నువ్వూరుకో. అడ్డుపడ్డానికి వాళ్ళు చిన్నపిల్లలు కాదు." ఉత్తమ్ వైపు చూస్తూ "మరి ఆఫీసు నుండి వచ్చినప్పుడు మాత్రం నీ 'పే కవరు' అందుకోడానికని ఎందుకనుకున్నావ్?"

"అలా అన్నానని అమ్మ చెప్పిందా?"

"కావాలని చెప్పలేదు - చెప్పాలనుకొనీ చెప్పలేదు. మనసులో ఉంచుకోలేక చెప్పింది. నీ మాటలైతే అమాయకంగా అమ్మ చెబితే తెలిసింది గానీ, నీ అన్న గారి మాటలు నా చెవినే పడ్డాయి"

"... ... ..."

"నువ్వూ ఏదో అలా అనేసావా?"

"ఏదో మూడ్‌లో అనేసాను. దాన్నంత సీరియస్‌గా తీసుకోవడం ఎందుకు?"

"నేను మీ మాటల్ని సీరియస్‌గా తీసుకోవడం లేదురా. సిన్సియర్‌గా తీసుకుంటున్నాను. ఇటు మేము కన్నవాళ్ళని, అటు మమ్మల్ని కన్నవాళ్ళనీ ఇద్దర్నీ రెండు చేతుల్తో పెనవేసుకుని బ్రతుకులు గడిపాం. కన్నవాళ్ళు కడతేరిపోయే వరకూ సంతృప్తిగా చూసాం. మీరు మాత్రం ఒక చేతిని జేబులో పెట్టుకొని మరోచేతిని కర్తవ్యం వెలుగు కళ్ళల్లో పడకుండా అడ్డుపెట్టుకొని భవిష్యత్తు వైపుకి చూస్తున్నారు".

"అనవసరంగా మీరెక్కువగా ఆలోచిస్తున్నారు నాన్నా..." రాఘవ అన్నాడు.

"అది నా అలవాటురా. ఉద్యోగంలో నేను చేసిన చిన్న తప్పే ఒకసారి పెద్ద ముప్పుని తెచ్చిపెట్టింది. ఆ తర్వాత ఎప్పుడూ ఏ చిన్న విషయాన్నీ తక్కువగా అంచనా వేయలేదు"

"ఇది ఉద్యోగం కాదు కదా నాన్నా" ఉత్తమ్ అన్నాడు.

"అవును. ఇది ఉద్యోగం కాదు జీవితం. అందుకే యింకా జాగ్రత్తగా వుండాలనుకుంటున్నా"

"అంటే...?" రాఘవ అన్నాడు.

భానుమూర్తిగారు గట్టిగా ఊపిరి పీల్చుకున్నారు. లక్ష్మి ఆతృతగా భర్త వైపే చూస్తోంది.

"మీకు బదిలీలై మా దగ్గరకు రావడానికి మీ బావగారి సాయంతో ఎన్నో ప్రయత్నాలు చేసాను.మళ్ళీ ఇప్పుడు మిమ్మల్ని దూరం చేసుకోబోతున్నాను..."

కొడుకులిద్దరూ తండ్రి వైపు ఆశ్చర్యంగా, కంగారుగా చూసారు.

"మీ జీతాలు జాగ్రత్త చేసుకోండి. మీ పెళ్ళిళ్ళు మీకిష్టం వచ్చినప్పుడు చేసుకోండి. కట్నాలు, కానుకలు మీరే లెక్కచూసుకోండి. కార్డు ముక్కవేస్తే తప్పకుండా వస్తాం. ఆశీర్వదిస్తాం. అక్షింతలు వేస్తాం. చుట్టాల్లా చూసి వెళ్ళిపోతాం..."

"నాన్నా... మాకు మళ్ళీ ట్రాన్స్‌ఫర్లకు ప్రయత్నాలు చేసారా? ఎంతో కష్టపడి ఈ ఊరు తీసుకొచ్చేరు. మళ్ళీ మమ్మల్ని ఎక్కడికో పంపించేయకండి నాన్నా" రాఘవ కంగారుగా అన్నాడు.

"అవును నాన్నా. ఇన్నాళ్ళూ రాష్ట్రం కాని రాష్ట్రంలో ఉన్నాం. మళ్ళీ మమ్మల్ని ఈ ఊరు వదిలి పెట్టి వెళ్ళి పోయేలా చేయకండి నాన్నా" చిన్న కొడుకు ప్రాధేయపూర్వకంగా అన్నాడు.

భానుమూర్తిగారు గట్టిగా నవ్వేరు. చాలాసేపునవ్వేరు. "అతి కష్టంమీద వీళ్ళని ఈ "ఊరు" తీసుకొచ్చేనట. ఈ ఇంటికి కాదు. మన దగ్గరకు కాదు. వేరే రాష్ట్రానికి బదిలీలై కష్టపడాల్సి వస్తుందన్న బాధే గానీ తల్లి దండ్రులకు దూరమైపోతున్నామన్న బాధ వీళ్ళకేమైనా ఉందంటావా?"

తండ్రి వైపు అయోమయంగా చూడ్డం తప్ప ఏమీ మాట్లాడలేకపోయారిద్దరూ.

"ఒరేయ్. ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఎక్కడికి కావాలంటే అక్కడికి మిమ్మల్ని ట్రాన్స్‌ఫర్లు చేయించేటంత హోదా మీ నాన్నకి లేదురా. ఉన్నా అలా చేసే మనస్తత్వం ఏ తండ్రికీ ఉండదురా. ఈ ఊరు వదిలి వెళ్ళిపోయేది మీరు కాదు. నేను, మీ అమ్మానూ!"

కొడుకులిద్దరూ విస్తుపోయి తండ్రి వైపుచూస్తున్నారు. భానుమూర్తిగారు అదేమీ పట్టించుకోనట్లు మాట్లాడుతున్నారు.

"... రిక్వెస్టు ట్రాన్స్‌ఫర్‌కి దరఖాస్తు పెట్టి ప్రయత్నించేను. నాకు ట్రాన్స్‌ఫరయ్యింది. ఇక్కడికి ఎనిమిది వందల కిలోమీటర్ల దూరానికి. అదే, మీ అక్క బావగారూ ఉంటున్న ఊరికి..."

"నాన్నా!"

"అల్లుడు పరాయివాడై, కొడుకులు గుండెల్లో దాచుకొనే వాళ్ళైతే అది అదృష్టం. అల్లుడే కొడుకైతే అది అద్భుతం. చివరి రోజుల్లో అసరాకే వాళ్ళని వినియోగించుకుంటాను. ఏది మిగిలినా మీకందేలాగే చేస్తాను. ఇంక మీరు పడుకోండి. నాకు నిద్దరొస్తోంది..." అని భానుమూర్తిగారు లేచారు.

రాఘవ, ఉత్తమ్ లిద్దరూ దీనంగా ముఖాలు పెట్టుకొని ఏదో అనబోయారు.

"వద్దురా... వెళ్ళొద్దని, ఒంటరి వాళ్ళని చేయొద్దని, క్షమించమని అడగబోతున్నారు. అంతేకదా. వద్దు, మీకు తెలుసు కదా. నేననుకున్నదే చేస్తాను. అనుకుంటే తప్పకుండా చేస్తానని. అయినా ఆర్డర్స్ తయారై పోయాయి. అది రిక్వెస్టు మీద. ఆగదు. ఆపుకోడానికి కుదరదు. ఆపుకోను కూడా!" చాలా మామూలుగా అన్నారు భానుమూర్తిగారు.

అచేతనులై చూస్తూ ఉండిపోయారు తండ్రివైపు వాళ్ళిద్దరూ.

"రా లక్ష్మీ..."

కొడుకుల వైపు వెనక్కితిరిగి చూస్తూ భర్తను అనుసరించింది. లక్ష్మి.

గదిలోకి వెళ్ళగానే మంచం మీద వాలిపోయారు భానుమూర్తిగారు.

భర్తకు దుప్పటి కప్పుతూ...

"మీరు తొందరపడ్డారేమోనండీ" అంది నెమ్మదిగా లక్ష్మి.

"మనిషిగా జాగ్రత్త పడ్డానన్నా, తండ్రిగా తొందర పడ్డానన్నా రెండూ నిజమే లక్ష్మీ కానీ తప్పదు. వాళ్ళమీద ఆధారపడనప్పుడే వాళ్ళలా అన్నారంటే నిజంగా ఆధారపడిన రోజున వాళ్ళు మనకి ఆసరా అవుతారంటావా?" భానుమూర్తిగారు ప్రక్కకు తిరుగుతూ అన్నారు. లక్ష్మి ఆయన ప్రక్కన కూర్చుంది.

"వాళ్ళది తప్పే, నేనొప్పుకుంటాను. అయినా మీరు ట్రాన్స్‌ఫర్ చేయించుకోకుండా ఉండాల్సింది"

"నీకు చెప్పే చేసాను కదా?"

"చెప్పేరు గానీ ఇలా చేస్తారనుకోలేదు"

"నా సంగతి తెలిసిన దానివి. నువ్వే అలా మాట్లాడుతున్నావేం?" భార్య చేతిని తన చేతిలోకి తీసుకుంటూ "అయినా అమ్మాయి మనకి దూరంగా ఉందిన్నాళ్ళూ. రిటైరయ్యే వరకూ వాళ్ళున్న ఊళ్ళో ఉందాం. దానికూడా సంతృప్తిగా ఉంటుంది" అన్నారు.

"కానీ ఇక్కడ కుర్రాళ్ళిద్దరూ ఒంటరిగా, వంటా, వార్పూ..."

"ఒకే మనస్తత్వం ఉన్న అన్నదమ్ములు కదా. ఫర్వాలేదు. కలిసే చేసుకుంటారు"

"ఎన్నాళ్ళు చేసుకోగలరండీ?"

"పెళ్ళిళ్ళయ్యేవరకూ..."

క్షణం తర్వాత...

"... ఏవండీ. పిల్లల్ని వాళ్ళే వెదుక్కోవాలా. వాళ్ళ పెళ్ళిళ్ళు వాళ్ళే చేసుకోవాలా. మనం చుట్టాల్లాగే వెళ్తామా వాళ్ళ పెళ్ళిళ్ళకు?"

భార్యగా ఇంతవరకూ మౌనంగా ఉండిపోయినా - తల్లిగా తల్లడిల్లిపోయింది లక్ష్మి ఇప్పుడు, ఆవేదన ఆవిరై - కనుగ్రుడ్ల వెనుక మేఘాలై. అది చూసి భానుమూర్తిగారు కదిలిపోయారు. భార్యను ఆపేక్షగా గుండెలకు హత్తుకున్నారు. చెంపల మీదుగా జాలువారుతున్న కన్నీటిని తుడిచారు.

" లోకంలో అసలైన పిచ్చివాళ్ళు ఎవరో తెలుసా లక్ష్మీ కన్నవాళ్ళే. అందుకే పిల్లల మాటలకు తడికాని నీ కళ్ళు నా మాటలకు వర్షిస్తున్నాయి. నువ్వు కన్నీళ్ళు కారుస్తున్నావు. నేను దిగమింగుతున్నాను. నీది ఆవేదన. నాది ఆలోచన. అంతే తేడా...

"పిచ్చిలక్ష్మీ. మన పిల్లల పెళ్ళిళ్ళకు మనం చుట్టాలెందుకవుతామోయ్. నేనంత మనసులేని వాడిననుకుంటున్నావా. పిల్లలకో దారి, తోడూ చూడాల్సిన బాధ్యత మనదేనని నాకు తెలీదనుకుంటున్నావా. పెంచి పెద్దచేసే బాధ్యత పెద్దవాళ్ళదైతే, పెద్దవాళ్ళు కడ తేరిపోయేదాకా తమ నీడలో ఉంచుకోవాల్సిన బాధ్యత పిల్లలది. ఈ కాలం పిల్లలు కొంతమంది బాధ్యతను భారం అనుకుంటున్నారు. ఆ భావనని చెరిపేసి పెద్దవాళ్ళ అండ తమకు, తమ నీడ పెద్ద వాళ్ళకూ ఎంత అవసరమో తెలియజెప్పాలి, అలాంటి పిల్లలకు. నేను చేస్తున్నదదే....

"వాళ్ళ మెదడులో పడ్డ విత్తనం మంచిది కాదు. సరియైన ఆలోచనలు మెదడుకు అందితే ఆ విత్తనం విస్తరించదు. అంతరించిపోతుంది. అలాంటి ఆలోచనలు వాళ్ళకు అందాలంటే ఈ కొద్దిపాటి ఎడబాటు తప్పదు. ఈలోగా వాళ్ళకు పెళ్ళికూతుళ్ళను మనమే చూస్తాం. పెళ్ళిళ్ళూ మనం దగ్గరరుండే జరిపిస్తాం. కుడికాలితో గడపదాటి లోపలకు వచ్చే కోడళ్ళకు హారతి నువ్వే ఇస్తావు. ఆ వేడుక నేను నీ ప్రక్కన ఉండే చూస్తాను. సరేనా. ఇప్పటికైనా కుదుటపడి కళ్ళు తుడుచుకుంటావా... చాలా ఆలస్యమైంది. అలసిపోయావు కూడా. పడుకో లక్ష్మీ..."

అప్పటిగ్గానీ తేరుకోలేకపోయింది ఆ తల్లి మనస్సు.